
అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తాం

● మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. బంజారాహిల్స్ డివిజన్ ప్రేమ్‌నగర్‌లో శనివారం రూ. 22.30 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు, రూ. 20 లక్షల వ్యయంతో చేపట్టనున్న నూతన సీవరేజీ లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నగరాన్ని సుందరంగా, స్వచ్ఛ, పచ్చదనంగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని డ్రైనేజీ, రోడ్లు తదితర మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి, ఈఈ విజయ్‌కుమార్, వాటర్ వర్క్స్ మేనేజర్ శివకుమార్, సంబంధిత శాఖల అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యక్రమం

● కాంగ్రెస్ నేత విశాల్ సుధాం

బేగంపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి ప్రతి గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రగతి సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ సీనియర్ నేత విశాల్ సుధాం తెలిపారు. బేగంపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా పార్టీ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పార్టీ కార్యాలయంలో జరిగే సమావేశంలో సనత్‌నగర్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి డా. కోట నీలిమ పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించనున్నట్లు తెలిపారు. రోడ్లు, సీవరేజీ, తాగునీరు, వీధి దీపాలతో పాటు పలు సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చన్నారు.

బడ్జెట్‌లో విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలి

పంజాగుట్ట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్లో విద్యకు 15 శాతం నిధులు కేటాయించి ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేస్తామని, నాణ్యమైన విద్యనందిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 2024-25 బడ్జెట్లో కేవలం 7.6 శాతం నిధులు మాత్రమే కేటాయించిందని తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య ప్రతినిధులు అన్నారు. ఈసారి బడ్జెట్‌లో అయినా విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సమాఖ్య ప్రతినిధులు పూజ, జ్యోతి, కృప, సోనియా, మాధవి తదితరులు మాట్లాడారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత రాష్ట్రంలో కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందిస్తామని, కార్పొరేట్ విద్యకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందిస్తామని బీఆర్‌ఎస్ నేతలు ఉద్యమ సమయంలో చెప్పారని.. పది సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పటికీ వారు సగటున 6.6 శాతం నిధులు మాత్రమే కేటాయించారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం సైతం అవే విధానాలను అవలంబిస్తోందని వారు విమర్శించారు. ఈ సమావేశంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ జనాభా తగ్గిందనే ప్రచారం సరికాదు

● బీసీ రక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు ప్రదీప్‌గౌడ్

పంజాగుట్ట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇటీవల జరిగిన కుల గణనలో బీసీల జనాభా తగ్గిందని జరుగుతున్న ప్రచారం చిల్లర పంచాయితీ అని, కొంతమంది నాయకులు తమ ప్రయోజనాల కోసమే బీసీలను రెచ్చగొడుతున్నారని బీసీ రక్షణ సమితి జాతీయ అధ్యక్షులు తీగల ప్రదీప్ గౌడ్ ఆరోపించారు. పంజాగుట్టలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2014లో కేసీఆర్ చేసిన సమగ్ర కుటుంబ సర్వేతో పోల్చితే 5% బీసీ జనాభా తగ్గిందని ఆరోపించడం అశాస్త్రీయమన్నారు. సర్వే వివరాలను అధ్యయనం చేసే విధానం ఇది కాదన్నారు. అధికారికంగా బీసీల జనాభాను ప్రకటించిన సందర్భమే ఈ దేశంలో ఎక్కడా లేనప్పుడు ఈ వివరాలను గుడ్డిగా వ్యతిరేకించడం తప్పన్నారు. కుల సర్వేలో లోపాలు ఉన్నాయని, అయితే సర్వేనే తప్పని వాదించడం సిగ్గుచేటన్నారు. ఎస్సీ వర్గీకరణలో లోపాలున్నాయని నిరసన తెలుపుతూనే ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మంద కృష్ణమాదిగ బిల్లును స్వాగతించారన్నారు. లోపాలను సవరించడానికి ప్రభుత్వం మళ్లీ చర్యలు తీసుకోవడం గొప్ప విషయమన్నారు. బీసీలకు రాజ్యాధికారం రావాలంటే బీసీ నాయకత్వం బలపడాలని, బీసీ ప్రజలు ఏకం కావాలని.. అంతేతప్ప రెడ్లను తిడితే రాజ్యాధికారం రాదని ఆయన పేర్కొన్నారు.

జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వద్ద బీఎండబ్ల్యూ కారు బీభత్సం

బంజారాహిల్స్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వద్ద బీఎండబ్ల్యూ కారు బీభత్సం సృష్టించింది. శనివారం ఉదయం ఫిలింనగర్ నుంచి జూబ్లీహిల్స్ వైపు వేగంగా వెళ్తున్న కారు చెక్‌పోస్టు వద్దకు రాగానే అదుపుతప్పింది. డివైడర్ పైకి ఎక్కి ట్రాఫిక్‌బూత్ ఎదురుగా ఉన్న దిమ్మెలను ఢీ కొట్టింది. కారులో బెలూన్‌లు తెరుచుకోవడంతో డ్రైవర్ క్షేమంగా బయట పడ్డాడు. అనంతరం కారును అక్కడే వదిలేసి వెళ్లిపోయాడు. డ్రైవర్ మద్యం మత్తులో ఉండి ఉంటాడని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

పంజాగుట్ట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తిని కారు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతిచెందిన ఘటన పంజాగుట్ట పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బహదూర్‌పుర కిషన్‌బాగ్‌కు చెందిన ఎండీ నసీర్ శనివారం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా బేగంపేట ఐటీసీ గ్రాండ్ కాకతీయ హోటల్ వద్ద కారు ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకుని, కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలి

● బీసీలకు ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలి

● జై భీమ్‌రావ్ భారత్ పార్టీ నేత కామేష్ డిమాండ్

పంజాగుట్ట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రేవంత్‌రెడ్డికి బీసీలకు న్యాయం చేయాలనే చిత్తశుద్ధి ఉంటే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి బీసీలకు ఆ పదవి ఇవ్వాలని జై భీమ్‌రావ్ భారత్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు యెర్రా కామేష్ డిమాండ్ చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన బీసీలకు అన్యాయం చేసేలా ఉందని విమర్శించారు. అగ్రవర్ణాలను 15 శాతంగా చూపించడం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల కోసమేనన్నారు. అధికారం పోయాక కేటీఆర్, కవితలకు బీసీలు గుర్తుకువచ్చారని, బీసీల మీద బీఆర్‌ఎస్‌కు ప్రేమ ఉంటే పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి ఆ సామాజికవర్గానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీల మొదటి ద్రోహి బీజేపీ అని, బీసీలకు ఫలాలు అందకుండా ఆ పార్టీ చేస్తుందని విమర్శించారు.

పారిశ్రామిక వేత్త చంద్రశేఖర జనార్దన్‌రావు హత్య కేసులో సీన్ రీ కన్‌స్ట్రక్షన్

పంజాగుట్ట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో సంచలనం సృష్టించిన ప్రముఖ పారిశ్రామిక వేత్త వెలమాటి చంద్రశేఖర జనార్దన్‌రావును దారుణంగా హత్య చేసిన ఘటనలో పంజాగుట్ట పోలీసులు నిందితుడు కీర్తి తేజను 5 రోజుల కస్టడీకి తీసుకున్న విషయం విదితమే. ఇందులో భాగంగా శనివారం కీర్తి తేజను పోలీసులు మణికొండ ల్యాంకో హిల్స్‌లోని అతడి ఇంటికి తీసుకెళ్లి విచారించారు. ఘటన జరిగిన రోజు అక్కడి నుంచి బేగంపేటలోని తన తాత చంద్రశేఖర జనార్దన్ రావు ఇంటికి ఎలా వచ్చాడు, కత్తి ఎక్కడ కొనుగోలు చేశాడో వివరాలు సేకరించినట్టు తెలిసింది. తాత ఇంట్లో ఏం జరిగింది, ఎవరు ఎక్కడ కూర్చున్నారు, అతని తల్లి సరోజినిదేవి ఎక్కడ ఉంది తదితర వివరాలతో సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేసినట్లు తెలిసింది. ఈ విషయంపై పోలీసులను వివరాలు అడగ్గా ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. దీంతో పోలీసుల తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


నందినగర్‌లో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్


బంజారాభవన్‌లో జరిగిన వేడుకల్లో మంత్రి సీతక్క, టీపీసీసీ కార్యదర్శి విజయారెడ్డి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తలసాని

ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సేవాలాల్ మహారాజ్ దేశంలోని బంజారాల ప్రాంతాల్లో ఆధ్యాత్మిక శక్తిగా కీర్తి గాంచారని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొ.సూర్య ధనుంజయ్ అన్నారు. సంత్ సేవాలాల్ 286వ జయంతి సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని డా.బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో శనివారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా 'సేవాలాల్-దూరదృష్టి' అనే అంశంపై ప్రొ.సూర్య ధనుంజయ్ స్మారకోపన్యాసం చేశారు. సేవాలాల్ ఒక దార్శనికుడు, తాత్వికవేత్త అని ఆధ్యాత్మిక బోధనలు, భక్తి ప్రవచనాలు చెబుతూ తన జీవితాన్ని బంజారాల కోసం త్యాగం చేశారని చెప్పారు. ఇటీవలి కాలంలో సంత్ సేవాలాల్ కీర్తి తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువగా ప్రాచుర్యం పొందిందని, దానికి తాను చేసిన పరిశోధనలు, ప్రచురణలు సైతం కారణం కావడం గర్వంగా ఉందన్నారు. అంబేడ్కర్ వర్సిటీ వీసీ ప్రొ.ఘంటా చక్రపాణి మాట్లాడుతూ.. సంత్ సేవాలాల్ గొప్ప మానవతావాదిగా, బంజారాల ఆరాధ్య దైవంగా కీర్తి పొందినట్లు వివరించారు. బంజారాల బాగుకోసం, ఆత్మగౌరవం కోసం ఎని చేశారని పేర్కొన్నారు. శతాబ్దాల క్రితమే సంత్ సేవాలాల్ ఆదర్శ జీవనం గడిపారని, యువత సేవాలాల్‌ను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అకడమిక్ డైరెక్టర్ ప్రొ.జి.పుష్పాచక్రపాణి, రిజిస్ట్రార్ డా.ఎల్.విజయకృష్ణారెడ్డి, ఎస్సీ, ఎస్టీ సెల్ ఆఫీసర్ డా.బానోత్ ధర్మ, ప్రొ. చంద్రకళ, డా.ప్రమీల కేతావత్, డా.బోజు శ్రీనివాస్, రెడ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.


జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న మహిళా విశ్వవిద్యాలయం వీసీ ప్రొ. సూర్య ధనుంజయ్, అంబేడ్కర్ వర్సిటీ వీసీ ప్రొ.ఘంటా చక్రపాణి

బంజారాహిల్స్‌లో..

బంజారాహిల్స్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. బంజారాహిల్స్‌లోని బంజారా భవన్‌లో పెద్ద ఎత్తున గిరిజనులు సంప్రదాయ దుస్తులతో సందడి చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క, టీపీసీసీ కార్యదర్శి పి.విజయారెడ్డి హాజరై సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పించారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 14 నందినగర్‌లో జరిగిన వేడుకల్లో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి.భారతీనాయక్, బీఆర్‌ఎస్ నాయకులు బాబానాయక్, రాములు చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీఆర్‌హిల్స్‌లో..

బోరబండ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సంచార జాతుల జీవితాల్లో వెలుగులు నింపి, బంజారాల హక్కుల కోసం పోరాటం చేసిన సంత్ సేవాలాల్ స్ఫూర్తి గొప్పదని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జైపాల్, గిరిజన కార్పొరేషన్ చైర్మన్ బెల్లంనాయక్ అన్నారు. ఎస్పీఆర్‌హిల్స్ ఇంద్రానగర్, జంగయ్య బస్తీలోని సేవాలాల్ మందిర్‌లో ఆయన జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ సీఎన్ రెడ్డి సేవాలాల్‌కు ప్రత్యేక పూజలు చేశారు.


సేవాలాల్ జయంతిలో పాల్గొన్న బీసీ, ఎంబీసీ, గిరిజన కార్పొరేషన్ చైర్మన్‌లు

బోరబండలో..

బీజేపీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కుమార్‌నాయక్ అధ్వర్యంలో జరిగిన జయంతి వేడుకల్లో ఏసీపీ వెంకటరమణ, సీఐ వీరశేఖర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గంగరాజు, షర్మిలాజాదవ్, వెంకటేష్, చంద్రమోహన్, గణేష్‌రెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బాపూనగర్‌లో..

అమీర్‌పేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బంజారా జాతి ఔనత్యాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు సంత్ సేవాలాల్ అని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం అమీర్‌పేట డివిజన్‌లోని బాపూనగర్‌లో నిర్వహించిన సేవాలాల్ 286వ జయంతి కార్యక్రమానికి హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గిరిజనులకు దశ, దిశను బోధిస్తూ సన్మార్గంలో నడిపించేందుకు కృషి చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి నామన సంతోష్, మణి కుమార్, నాయకులు అశోక్ యాదవ్, కూతురు నర్సింహ, శేఖర్, ప్రకాష్ గౌడ్, కట్టా బలరాం తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న డాక్టర్ కోట నీలిమ

కోట నీలిమ నివాళులు..

సంత్ సేవాలాల్ జయంతిని పురస్కరించుకుని బాపూనగర్‌లోని ఆయన ఆలయాన్ని సందర్శించిన కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోట నీలిమ నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. బడుగు, అణగారిన వర్గాలకు సేవ చేయడంలో అసలైన ఆనందం ఉందని నమ్మి, వారి ఉన్నతి కోసం పాటుపడిన వ్యక్తి సేవాలాల్ అని కొనియాడారు. ఈ కార్యక్రంలో బాలూ నాయక్, ప్రతాప్ నాయక్, పిక్కి బాయి, కృష్ణకుమార్, కునాల్ రాథోడ్, అమర్ సింగ్, గణేష్, రాజునాయక్, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో శివాజీ విగ్రహాలను పెట్టనివ్వడం లేదు

● బీజేపీ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

పంజాగుట్ట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మొగలులు, తురుష్కుల బారినుంచి భారతీయులను కాపాడిన మహా వీరుడు, పరిపాలనాదక్షుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ అని, అలాంటి మహనీయుడి విగ్రహాలను ఏర్పాటు చేయకుండా ప్రభుత్వం అడ్డుకుంటుందని బీజేపీ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో తాము అధికారంలోకి వస్తే ఫిబ్రవరి 19న శివాజీ మహరాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించడంతో పాటు ఆ రోజును సెలవు దినంగా ప్రకటిస్తామన్నారు. ఛత్రపతి శివాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సీడీ చౌహాన్, కాశీ విశ్వనాథ ట్రస్ట్ వ్యవస్థాపకుడు శివ స్వామితో కలిసి మిస్డ్ కాల్ నంబర్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ.. బావి తరాలకు శివాజీ మహరాజ్ జీవిత చరిత్రను, పోరాట పటిమను, ఆయన విజయాలను తెలియచెప్పాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం శివాజీ విగ్రహాలు పెట్టకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. హిందువులను వేధిస్తున్న పోలీస్ అధికారుల పేర్లను ఆరెంజ్ బుక్‌లోకి ఎక్కిస్తున్నట్లు తెలిపారు. ఔరంగజేబు వారసులు అయిన ఈ ప్రభుత్వానికి సమయం వచ్చినప్పుడు బుద్ధి చెబుతామని ఆయన హెచ్చరించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సీడీ చౌహాన్ మాట్లాడుతూ.. శివాజీ కోటలను పునరుద్ధరించాలని, దేశ వ్యాప్తంగా శివాజీ విగ్రహాలు ప్రతిష్ఠించాలని డిమాండ్ చేశారు.


మిస్డ్ కాల్ నంబర్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, ఫౌండేషన్ ప్రతినిధులు

విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి

● బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్ గౌడ్

పంజాగుట్ట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జనాభా దామాషా ప్రకారం బీసీలకు విద్య, ఉద్యోగాలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రమాదేవి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం సోమాజిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని బిల్లు ప్రవేశపెట్టి దానికి చట్టబద్ధత కల్పించాలని కోరారు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లును కేంద్రానికి పంపించి పార్లమెంట్‌లో పాస్ చేయించాలని, రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్పించే విధంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. తమిళనాడు తరహా రిజర్వేషన్ కల్పిస్తేనే బీసీ కులాలకు చెందిన ప్రజలలో ఆర్థిక అసమానతలు తొలుగుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో మహిళా ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులు షమీమ్ సుల్తానా, రాష్ట్ర కార్యదర్శి మహేంద్ర సాగర్ తదితరులు పాల్గొన్నారు.

15.950 కిలోల గంజాయి స్వాధీనం

(5వ పేజీ తరువాయి)

తెలిపిన వివరాల ప్రకారం.. కొంతమంది స్మగ్లర్లు ముఠాగా ఏర్పడి ఒడిశా నుంచి గంజాయిని గుట్టుగా సికింద్రాబాద్‌కు తరలిస్తున్నారు. అప్పటికే అక్కడ సిద్ధంగా ఉంటున్న ఉత్తరప్రదేశ్, ఢిల్లీకి చెందిన సరఫరాదారులకు సరుకును అందజేయడంతో వారు రైల్లో తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఒడిశాకు చెందిన స్మగ్లర్స్ సికింద్రాబాద్ వరకు సరుకును తీసుకొచ్చి ఉత్తరప్రదేశ్‌కు చెందిన మనోజ్, ధనుంజయకు శనివారం అందజేశారు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ వెంకటేశ్వర్లు బృందం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను సికింద్రాబాద్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. గంజాయి స్మగ్లర్స్‌ను పట్టుకున్న ఎస్‌టీఎఫ్ టీమ్‌ను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి. కమలాసన్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ భాస్కర్ అభినందించారు.

చిక్కడపల్లిలో 8 మంది..

చిక్కడపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గంజాయి త్రాగడానికి గుమిగూడడంతోపాటు గంజాయి బేరాలు చేస్తున్న 8 మందిని శనివారం రాత్రి చిక్కడపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ బి. రాజునాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్టీసీక్రాస్‌రోడ్ బస్‌భవన్ ఎదురు వీధిలో రిసాలకు చెందిన మహ్మద్ సిద్దిక్‌ఖాన్(25), మహ్మద్ నాసిర్(20), మహ్మద్ సైఫ్(20), రామ్‌నగర్‌కు చెందిన మహ్మద్ షోయబ్(25), బేగంపేటకు చెందిన పీక జతిన్(21), పీక ఆర్య(19), మహ్మద్ ఫర్దీన్(21), తిరుమలగిరికి చెందిన ఎస్ విఘ్నేష్(26)లను సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ బృందంతోకలిసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. కాగా వీరిలో అయిదుగిరిని కోర్టులో ప్రవేశపెట్టామని మిగతా ముగ్గురికి నోటీసులు ఇవ్వడం జరిగిందని వివరించారు. వారివద్దనుంచి 300 గ్రాముల గంజాయి, 12270 రూపాయలు, 2 బైక్‌లు, 9 సెల్‌ఫోన్‌లు సీజ్ చేయడం జరిగిందన్నారు. ఎవరైనా గంజాయి , డ్రగ్స్ సేవించినా, విక్రయించినా కఠినచర్యలు ఉంటాయని ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ హెచ్చరించారు.

కేపీహెచ్‌బీలో మరో వ్యక్తి..

హైదర్‌నగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గంజాయి అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహరాష్ట్రకు చెందిన సయ్యద్ సోహెల్ కేపీహెచ్‌బీలో గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం అందుకున్న మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసిపట్టుకున్నారు. అతని వద్ద నుంచి 650గ్రాముల డ్రై గంజాయి, 20ఎంఎల్ హాష్ ఆయిల్ స్వాధీనం చేసుకుని ఎస్‌ఓటీ పోలీసులు అతనిని కేపీహెచ్‌బీ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బెయిల్‌పై విడుదలై పరారీలో..

● తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు రౌడీషీటర్ల అరెస్ట్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బెయిల్‌పై విడుదలపై పరారీలో ఉన్న ఇద్దరు రౌడీషీటర్లను సౌత్‌ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అరెస్ట్ చేశారు. చాంద్రాయణగుట్ట, మాదన్నపేట పోలీస్‌స్టేషన్లలో 18 చోరీ, దాడి కేసుల్లో నిందితుడిగా ఉన్న రౌడీషీటర్ హబీబ్ తల్హాబిన్ అబ్దుల్ ఖదీర్ అల్‌ఐదూర్ అలియాస్ హబీబ్ తల్హా బెయిల్‌పై విడుదలై కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. పలు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో 7 నాన్‌బెయిలబుల్ వారెంట్లు జారీ అయ్యాయి. మాదన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీషీటర్ కె. ఆనంద్ అగర్వాల్ అలియాస్ మహ్మద్ జోయబ్ అలియాస్ ఎలుక అలియాస్ అన్నుపై రౌడీషీటర్ భక్తియాస్ ఖురేషీ హత్యకేసుతోపాటు ఎన్‌డీపీఎస్, ఆర్మ్స్ యాక్ట్ వంటి 11 కేసులున్నాయి. గంజాయి కేసులో 2024 ఆగస్టులో ఇతడిని పోలీసులు అరెస్ట్ చేశారు. బెయిల్‌పై బయటకు వచ్చినప్పటి నుంచి తప్పించుకు తిరుగుతున్నాడు. ఇతడిపై 2 నాన్‌బెయిలబుల్ వారెంట్లు ఉన్నాయి. వీరిద్దరూ మాదన్నపేటలో ఉన్నట్లు సమాచారం అందుకున్న సౌత్‌ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి 2.30 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం ఇద్దరినీ ఆయా పోలీస్‌స్టేషన్‌లకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ అందె శ్రీనివాసరావు తెలిపారు.

హెచ్‌పీవీ వ్యాక్సిన్లపై అవగాహన ఒప్పందం

మాదాపూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ డైరెక్టర్ కాంతి వెస్లీ సమక్షంలో నగరంలోని పేద బాలికలకు 500 హెచ్‌పీవీ వ్యాక్సిన్లను ఉచితంగా ఇవ్వడానికి అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. శనివారం అంతర్జాతీయ బాలల క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఈ అవగాహన ఒప్పందం కుదిరింది.

'వర్గీకరణతో అందరికీ న్యాయం'

పంజాగుట్ట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ కీలక దశకు చేరుకున్న తరుణంలో అందరికీ న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణ గ్రూప్-1లో నుంచి పంబాల, మన్నె కులాలను తొలగించాలని, బేడ బుడజంగాలకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. బేడ బుడగ జంగాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. ఇప్పటి వరకు చట్టసభల గడప తొక్కని కులాలు ఉన్నాయని.. ఆయా వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు..

ఫోన్ హ్యాక్ చేసి.. స్క్రీన్ బ్లాక్ చేసి

● రూ.1.43 లక్షలు కొట్టేసిన సైబర్ క్రిమినల్స్

● కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసినందుకు..

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కస్టమర్ కేర్ నంబర్ కోసం ఇంటర్నెట్‌లో వెతికిన బాధితుడు.. సైబర్ నేరగాళ్ల వలకు చిక్కాడు. అతడిని మాటలతో మాయచేసిన క్రిమినల్స్ మోసపూరిత లింక్‌లు పంపి ఫోన్ హ్యాక్ చేసి రూ. 1.43 లక్షలు కొట్టేశారు. మోసపోయినట్లు ఆలస్యంగా గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. నగరానికి చెందిన బాధితుడి బ్యాంక్ ఖాతా నుంచి రూ. 399 డెబిట్ అయినట్లు మెస్సేజ్ వచ్చింది. ఆ మెసేజ్‌లు చూస్తే 'కుకు ఎఫ్‌ఎమ్' సబ్‌స్క్రైబ్ నిమిత్తం డెబిట్ అయినట్లు తెలిసింది. దాంతో ఎలాగైనా డబ్బులు డెబిట్ కాకుండా ఆపేయాలని, 'కుకు ఎఫ్‌ఎమ్' కస్టమర్ కేర్ కోసం ఆన్‌లైన్‌లో వెతికాడు. అప్పుడు అతడికి ఒక నంబర్ కనిపించింది. వారికి ఫోన్ చేసి తన సబ్‌స్క్రైబ్‌ను తొలగించాలని కోరాడు. అందుకు అవతలి వ్యక్తి స్పందిస్తూ.. ఏ బ్యాంక్ నుంచి డబ్బులు డెబిట్ అవుతున్నాయో ఖాతా వివరాలు ఇవ్వండి అని చెప్పాడు. దాంతో బాధితుడు అతడు చెప్పినట్లు చేశాడు. ఆ తర్వాత ఒక లింక్‌ను పంపి ఓపెన్ చేసి, మీ ఖాతా నుంచి రూ.1 ట్రాన్స్‌ఫర్ చేయండి ఆ తర్వాత మేము లావాదేవీలు అన్నీ ఆపేస్తామని హామీ ఇచ్చాడు. అందుకు సంబంధించిన ప్రాసెస్ అంతా వీడియోకాల్ చేసి చూపించాడు. బాధితుడు వారు చెప్పినట్లు చేశారు. తన ఖాతా నుంచి రూ. 1 డెబిట్ అయిన వెంటనే బాధితుడి ఫోన్ స్క్రీన్ బ్లాక్ అయింది. ఫోన్ ఆన్‌లోనే ఉండడంతో బాధితుడు తన స్క్రీన్ బ్లాక్ అయిన విషయాన్ని చెప్పగా.. కంగారు పడొద్దు. కొద్దిసేపు అలాగే అవుతుంది. కాసేపట్లో ప్రాసెస్ అయిపోతుందని నమ్మించాడు. ఆ తర్వాత ఫోన్‌లో ఎవరూ స్పందించలేదు. బాధితుడు అయోమయానికి గురయ్యాడు. సుమారు 40 నిమిషాల తర్వాత తిరిగి ఫోన్ స్క్రీన్ ఆన్ అయింది. ఆ తర్వాత వెంటవెంటనే బ్యాంకు మెసేజ్‌లు రావడాన్ని గుర్తించి చెక్ చేయగా.. తన ఖాతా నుంచి మొత్తం రూ. 1,43,212 డెబిట్ అయినట్లు తేలింది. దాంతో బాధితుడు బ్యాంక్‌కు వెళ్లి జరిగిన విషయం చెప్పగా.. మీరు సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కడంతో వారు మీ ఖాతాలో డబ్బులు దోచేశారని చెప్పారు. బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

15.950 కిలోల గంజాయి స్వాధీనం

(5వ పేజీ తరువాయి)

తెలిపిన వివరాల ప్రకారం.. కొంతమంది స్మగ్లర్లు ముఠాగా ఏర్పడి ఒడిశా నుంచి గంజాయిని గుట్టుగా సికింద్రాబాద్‌కు తరలిస్తున్నారు. అప్పటికే అక్కడ సిద్ధంగా ఉంటున్న ఉత్తరప్రదేశ్, ఢిల్లీకి చెందిన సరఫరాదారులకు సరుకును అందజేయడంతో వారు రైల్లో తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఒడిశాకు చెందిన స్మగ్లర్స్ సికింద్రాబాద్ వరకు సరుకును తీసుకొచ్చి ఉత్తరప్రదేశ్‌కు చెందిన మనోజ్, ధనుంజయకు శనివారం అందజేశారు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ వెంకటేశ్వర్లు బృందం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను సికింద్రాబాద్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. గంజాయి స్మగ్లర్స్‌ను పట్టుకున్న ఎస్‌టీఎఫ్ టీమ్‌ను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి. కమలాసన్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ భాస్కర్ అభినందించారు.

చిక్కడపల్లిలో 8 మంది..

చిక్కడపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గంజాయి త్రాగడానికి గుమిగూడడంతోపాటు గంజాయి బేరాలు చేస్తున్న 8 మందిని శనివారం రాత్రి చిక్కడపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ బి. రాజునాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్టీసీక్రాస్‌రోడ్ బస్‌భవన్ ఎదురు వీధిలో రిసాలకు చెందిన మహ్మద్ సిద్దిక్‌ఖాన్(25), మహ్మద్ నాసిర్(20), మహ్మద్ సైఫ్(20), రామ్‌నగర్‌కు చెందిన మహ్మద్ షోయబ్(25), బేగంపేటకు చెందిన పీక జతిన్(21), పీక ఆర్య(19), మహ్మద్ ఫర్దీన్(21), తిరుమలగిరికి చెందిన ఎస్ విఘ్నేష్(26)లను సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ బృందంతోకలిసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. కాగా వీరిలో అయిదుగిరిని కోర్టులో ప్రవేశపెట్టామని మిగతా ముగ్గురికి నోటీసులు ఇవ్వడం జరిగిందని వివరించారు. వారివద్దనుంచి 300 గ్రాముల గంజాయి, 12270 రూపాయలు, 2 బైక్‌లు, 9 సెల్‌ఫోన్‌లు సీజ్ చేయడం జరిగిందన్నారు. ఎవరైనా గంజాయి , డ్రగ్స్ సేవించినా, విక్రయించినా కఠినచర్యలు ఉంటాయని ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ హెచ్చరించారు.

జ కేపీహెచ్‌బీలో మరో వ్యక్తి..

హైదర్‌నగర్,ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): గంజాయి అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మహరాష్ట్రకు చెందిన సయ్యద్ సోహెల్ కేపీహెచ్‌బీలో గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం అందుకున్న మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసిపట్టుకున్నారు. అతని వద్ద నుంచి 650గ్రాముల డ్రై గంజాయి, 20ఎంఎల్ హాష్ ఆయిల్ స్వాధీనం చేసుకుని ఎస్‌ఓటీ పోలీసులు అతనిని కేపీహెచ్‌బీ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బెయిల్‌పై విడుదలై పరారీలో..

● తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు రౌడీషీటర్ల అరెస్ట్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బెయిల్‌పై విడుదలపై పరారీలో ఉన్న ఇద్దరు రౌడీషీటర్లను సౌత్‌ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అరెస్ట్ చేశారు. చాంద్రాయణగుట్ట, మాదన్నపేట పోలీస్‌స్టేషన్‌లలో 18 చోరీ, దాడి కేసుల్లో నిందితుడిగా ఉన్న రౌడీషీటర్ హబీబ్ తల్హాబిన్ అబ్దుల్ ఖదీర్ అల్‌ఐదూర్ అలియాస్ హబీబ్ తల్హ బెయిల్‌పై విడుదలై కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. పలు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో 7 నాన్‌బెయిలబుల్ వారెంట్లు జారీ అయ్యాయి. మాదన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీషీటర్ కె. ఆనంద్ అగర్వాల్ అలియాస్ మహ్మద్ జోయబ్ అలియాస్ ఎలుక అలియాస్ అన్నుపై రౌడీషీటర్ భక్తియాస్ ఖురేషీ హత్యకేసుతోపాటు ఎన్‌డీపీఎస్, ఆర్మ్ యాక్ట్ వంటి 11 కేసులున్నాయి. గంజాయి కేసులో 2024 ఆగస్టులో ఇతడిని పోలీసులు అరెస్ట్ చేశారు. బెయిల్‌పై బయటకు వచ్చినప్పటి నుంచి తప్పించుకు తిరుగుతున్నాడు. ఇతడిపై 2 నాన్‌బెయిలబుల్ వారెంట్లు ఉన్నాయి. వీరిద్దరూ మాదన్నపేటలో ఉన్నట్లు సమాచారం అందుకున్న సౌత్‌ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి 2.30 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం ఇద్దరినీ ఆయా పోలీస్‌స్టేషన్‌లకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ అందె శ్రీనివాసరావు తెలిపారు.

ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి

బోయిన్‌పల్లి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): సేవాలాల్ మహరాజ్ గిరిజనుల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని అంకిత చేశారని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నా రు. బోయిన్‌పల్లిలోని ప్రభుత్వ గిరిజన సంక్షే మ ఆశ్రమ పాఠశాలలో సంత్ సేవాలాల్ 286వ జయంతి ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్య అతిథిగా హాజరై పాఠశాల ప్రిన్సిపాల్ బానోతు లాలూనాయక్‌తో కలిసి సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా వేడుకలు నిర్వహించడానికి ప్రభుత్వం 200 కోట్ల రూపాయలు మంజూరు చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కె.రమేష్, ఆర్ఐ ప్రతాప్, హెచ్ఎం అముక్తమాల్యద పాల్గొన్నారు.



జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేష్, ప్రిన్సిపాల్ లాలూనాయక్

కేసీఆర్ బాటలోనే రేవంత్ సర్కార్

● కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ

సికింద్రాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ ప్రభుత్వం మాదిరిగానే రేవంత్‌రెడ్డి సర్కారు సైతం కంటోన్మెంట్‌ను నిర్లక్ష్యం చేస్తున్నదని, కోర్టు మెట్లు ఎక్కితే తప్ప కంటోన్మెంట్‌కు రావాల్సిన నిధులు ఇవ్వడం లేదని సికింద్రాబాద్ కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జె.రామకృష్ణ అన్నారు. మహేంద్రా హిల్స్‌లోని తన కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కంటోన్మెంట్‌కు రావాల్సిన ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీ ట్యాక్స్ (టీపీటీ) చార్జీల బకాయిల విషయంలో గతంలో తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించగా కేసీఆర్ ప్రభుత్వం పాక్షికంగా బకాయిలు చెల్లించిందని చెప్పారు. కాగా బీఆర్ఎస్ ప్రభుత్వం స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిందని, రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కూడా కేసీఆర్ సర్కారు బాటలోనే పయనిస్తున్నదని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.40 కోట్ల మేరకు టీపీటీ చార్జీల బకాయిలు రావాలని, ఎన్నిమార్లు అడిగినా చెల్లించకపోవడంతో బీజేపీ తరఫున న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్టు తెలిపారు. కోర్టు నుంచి లేఖ అందుకున్న నాలుగు వారాల్లోపు బకాయిలు చెల్లించాలని తీర్పు వచ్చినట్టు రామకృష్ణ వెల్లడించారు. కాగా తాను అభివృద్ధి పనులు చేపడుతుండడాన్ని స్థానిక శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. విజయానంద్, సతీష్, శంకర్, ప్రశాంత్, అశోక్, వీరవర్ధన్, విజయ్, అజయ్‌గౌడ్, వైశాలిని, సంతోష్, అరుణ్, పవన్, ప్రవీణ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డిలో రేవంత్‌కు పరాభవం తప్పలేదు

బీజేపీ రజక సెల్ రాష్ట్ర కన్వీనర్ రాజేశ్వరి

సికింద్రాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ బీసీ కులానికి చెందిన వారు కాదని, లీగల్లీ కన్వర్టెడ్ బీసీ అంటూ వ్యాఖ్యానించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తొలుత సోనియా, రాహుల్, ప్రియాంక ఏ కులం వారో స్పష్టం చేయాలని బీజేపీ రజక సెల్ రాష్ట్ర కన్వీనర్ మల్లేశ్వరపు రాజేశ్వరి డిమాండ్ చేశారు. మెట్టుగూడలో ఆమె శనివారం మీడియాతో మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల వేళ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మినహా ఏ ఒక్కటీ నెరవేర్చని రేవంత్‌రెడ్డికి మోదీ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. కామారెడ్డిలో ప్రజలు కేవలం కేసీఆర్‌ను మాత్రమే ఓడించలేదని, రేవంత్‌రెడ్డికి సైతం పరాభవం తప్పలేదన్నారు. ఈ విషయం ఆయన మరిచిపోయినట్టున్నారని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వంపై, ప్రధాని మోదీపై విమర్శలు మాని రాష్ట్ర ప్రజల సమస్యలు పరిష్కరించాలని హితవు పలికారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కో కన్వీనర్ సరోజ, మెట్టుగూడ డివిజన్ బీజేపీ ఓబీసీ అధ్యక్షులు ఆవుల గణేష్ పాల్గొన్నారు.

ఫోన్ హ్యాక్.. స్ర్కీన్ బ్లాక్ చేసి రూ.1.43 లక్షలు కొట్టేసిన సైబర్ క్రిమినల్స్

● కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసినందుకు..

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కస్టమర్ కేర్ నంబర్ కోసం ఇంటర్నెట్‌లో వెతికిన బాధితుడు.. సైబర్ నేరగాళ్ల వలకు చిక్కాడు. అతడిని మాటలతో మాయచేసిన క్రిమినల్స్ మోసపూరిత లింక్‌లు పంపి ఫోన్ హ్యాక్ చేసి రూ. 1.43 లక్షలు కొట్టేశారు. మోసపోయినట్లు ఆలస్యంగా గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. నగరానికి చెందిన బాధితుడి బ్యాంక్ ఖాతా నుంచి రూ. 399 డెబిట్ అయినట్లు మెస్సేజ్ వచ్చింది. ఆ మెసేజ్‌లు చూస్తే 'కుకు ఎఫ్ఎమ్' సబ్‌స్ర్కైబ్ నిమిత్తం డెబిట్ అయినట్లు తెలిసింది. దాంతో ఎలాగైనా డబ్బులు డెబిట్ కాకుండా ఆపేయాలని, 'కుకు ఎఫ్ఎమ్' కస్టమర్ కేర్ కోసం ఆన్‌లైన్‌లో వెతికాడు. అప్పుడు అతడికి ఒక నంబర్ కనిపించింది. వారికి ఫోన్ చేసి తన సబ్‌స్ర్కైబ్‌ను తొలగించాలని కోరాడు. అందుకు అవతలి వ్యక్తి స్పందిస్తూ.. ఏ బ్యాంక్ నుంచి డబ్బులు డెబిట్ అవుతున్నాయో ఖాతా వివరాలు ఇవ్వండి అని చెప్పాడు. దాంతో బాధితుడు అతడు చెప్పినట్లు చేశాడు. ఆ తర్వాత ఒక లింక్‌ను పంపి ఓపెన్ చేసి, మీ ఖాతా నుంచి రూ.1 ట్రాన్స్‌ఫర్ చేయండి ఆ తర్వాత మేము లావాదేవీలు అన్ని ఆపేస్తామని హామీ ఇచ్చాడు. అందుకు సంబంధించిన ప్రాసెస్ అంతా వీడియోకాల్ చేసి చూపించాడు. బాధితుడు వారు చెప్పినట్లు చేశారు. తన ఖాతా నుంచి రూ. 1 డెబిట్ అయిన వెంటనే బాధితుడి ఫోన్ స్ర్కీన్ బ్లాక్ అయింది. ఫోన్ ఆన్‌లోనే ఉండడంతో బాధితుడు తన స్ర్కీన్ బ్లాక్ అయిన విషయాన్ని చెప్పగా.. కంగారు పడొద్దు, కొద్దిసేపు అలాగే అవుతుంది. కాసేపట్లో ప్రాసెస్ అయిపోతుందని నమ్మించాడు. ఆ తర్వాత ఫోన్‌లో ఎవరూ స్పందించలేదు. బాధితుడు అయోమయానికి గురయ్యాడు. సుమారు 40 నిమిషాల తర్వాత తిరిగి ఫోన్ స్ర్కీన్ ఆన్ అయింది. ఆ తర్వాత వెంటవెంటనే బ్యాంకు మెసేజ్‌లు రావడాన్ని గుర్తించి చెక్ చేయగా.. తన ఖాతా నుంచి మొత్తం రూ. 1,43,212 డెబిట్ అయినట్లు తేలింది. దాంతో హుటాహుటిన బాధితుడు బ్యాంక్‌కు వెళ్లి జరిగిన విషయం చెప్పగా.. మీరు సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కడంతో వారు మీ ఖాతాలో డబ్బులు దోచేశారని చెప్పారు. బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల్లు మత్తులో వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం

తిరుమలగిరి ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కల్లుకు బానిసైన వృద్ధురాలు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సంధ్యారాణి తెలిపిన వివరాల ప్రకారం... లాల్‌బజార్ పెరుమాళ్ హట్స్‌కు చెందిన సులోచన(60) నివాసం ఉంటుంది. ఆమెకు ఒక కొడుకు కిరణ్, ఇద్దరు కూతుర్లు మంజుల, లక్ష్మి ఉన్నారు. పెద్ద కూతురు మంజుల భర్తతో విడాకులు తీసుకుని ఇంటి వద్ద ఉంటుంది. సులోచన కొన్ని సంవత్సరాలుగా కల్లుకు బానిసై రోజూ తాగుతుంది. అయితే కొంతకాలం నుంచి కుమారుడు కల్లు తాగొద్దని మందలిస్తున్నాడు. శనివారం లాల్‌బజార్‌లోని కల్లు కాంపౌండ్‌లో కల్లు తాగి, వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను తీసుకుని చిన్నకమేల బస్తీకి వెళ్లే దారిలోని గ్రౌండ్‌లోకి సులోచన వెళ్లింది. వంటిపై పోసుకుని నిప్పు అంటించుకుంది. చుట్టు పక్కల వారు చూసి మంటలను ఆర్పేశారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వగానే పోలీసులు వచ్చి, ఆమెను చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి సీరియస్‌గా ఉందని పోలీసులు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు పర్యవేక్షణలో ఎస్సై సంధ్యారాణి ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో నలుగురి మృతి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో శనివారం నలుగురు మృతి చెందారు. ఒకరు రైలు నుంచి జారిపడి అక్కడికక్కడే మరణించాడు. మేడ్చల్ రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వృద్ధుడు, రైల్వే డీజిల్ లోకో షెడ్డులో గుర్తుతెలియని వృద్ధురాలు, తుకారాంగేట్‌లో గుర్తుతెలియని వృద్ధురాలు మృతి చెందారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి..

కదులుతున్న రైలు నుంచి ఓ ప్రయాణికుడు ప్రమాదవశత్తు కిందపడి అక్కడికక్కడే మరణించాడు. ఈ ఘటన మనోహరాబాద్ ప్రాంతంలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్లా ముస్తాబాద్ ప్రాంతానికి చెందిన వినోద్(28) ఈనెల 13న రాత్రి తన మేనబావతో కలిసి రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైలులో వస్తున్నాడు. 14వ తేదీ తెల్లవారుఝామున మనోహరాబాద్ -మేడ్చల్ రైల్వే స్టేషన్‌ల మార్గమధ్యలో రైలులో డోర్ వద్ద వినోద్ ఉన్నాడు. ప్రమాదవశాత్తు అతను కింద పడి బలమైన గాయాలతో అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మేడ్చల్ రైల్వే స్టేషన్‌లో వృద్ధుడు..

మేడ్చల్ రైల్వేస్టేషన్‌లో మృతి చెందిన వృద్ధుడి మృతదేహాన్ని రైల్వే పోలీసులు మార్చురీకి తరలించారు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ రైల్వే స్టేషన్‌లోని ప్లాట్ ఫాం దగ్గర ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వద్ద గుర్తుతెలియని 65 ఏళ్ల వృద్ధుడు చనిపోయాడని సమాచారం రావడంతో రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. ఈ వృద్ధుడి ఆచూకీ తెలిస్తే వెంటనే 9440083160 నెంబరుకు సమాచారం ఇవ్వాలని డేవిడ్ రాజ్ కోరారు.

రైల్వే డీజిల్ లోకో షెడ్డులో మహిళ..

రైల్వే డీజిల్ లోకో షెడ్డులో మృతి చెందిన గుర్తుతెలియని మహిళను గాంధీ మార్చురీకి తరలించారు. సికింద్రాబాద్ జీఆర్‌పీ ఎస్సై మాజీద్ తెలిపిన వివరాల ప్రకారం... సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న డీజిల్ లోకో షెడ్డులో గుర్తుతెలియని 60 ఏళ్ల మహిళ చనిపోయి ఉందని రైల్వే స్టేషన్ డిప్యూటీ స్టేషన్ మాస్టర్ కుమారి శనివారం సికింద్రాబాద్ జీఆర్‌పి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా స్థలానికి వెళ్లిన జీఆర్‌పీ పోలీసులు మృతదేహాన్ని గాంధీఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈమె ఆచూకీ తెలిస్తే 04027700568 నెంబరుకు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తుకారాంగేట్‌లో గుర్తుతెలియని వృద్ధురాలు

అడ్డగుట్ట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తుకారాంగేట్‌లో గుర్తుతెలియని వృద్ధురాలు మృతి చెందింది. తుకారాంగేట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శంకర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం... తుకారాంగేట్‌లోని సుభాష్ విగ్రహం వద్ద గుర్తుతెలియని 60 ఏళ్ల వృద్ధురాలి చనిపోయిందని సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతురాలి ఆచూకి తెలిస్తే వెంటనే తుకారాంగేట్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు. కేసు దర్యాప్తులో ఉంది.